క్లుప్తంగా

చదువుతోనే బంగారు భవిష్యత్తు



మాట్లాడుతున్న ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి

వెల్దుర్తి: చదువుతోనే బాలికలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక బాలికల జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన పదవ తరగతి విద్యార్థినులు, తల్లితండ్రుల సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన చదువుకు మించిన ఆస్తి లేదన్నారు. ఫోన్ ఇతరత్రా ఆకర్షణలకు దూరంగా ఉండి, శ్రద్ధగా చదువుకోవాలన్నారు. బాల్య వివాహాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ ఇతరత్రాలతో జరిగే దుష్పరిణామాలు, వాటి నియంత్రణకు తాము తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. సమావేశంలో హెచ్‌ఎం చంద్రావతి పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు తప్పనిసరి

తుగ్గలి: ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం వల్ల ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నీటి బారి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎంపీడీఓ సావిత్రి, హౌసింగ్ డీఈ విజయకుమార్ అన్నారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం పగిడిరాయిలోని జగనన్న లే అవుట్‌ను పరిశీలించారు. ఇళ్ల వద్ద ఇంకుడు గుంత నిర్మించుకుంటే ప్రభుత్వం రూ.6 వేలు అందజేస్తుందని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకొని దసరా పండులోపు ఇళ్లలో చేరాలన్నారు. నిర్మాణాల్లో నిర్లక్ష్యం చేస్తే బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రామకృష్ణ, ఈసీ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆలూరు విద్యార్థి



రవూఫ్

ఆలూరు రూరల్: రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఆలూరు ప్రభుత్వ పాఠశాల-1 విద్యార్థి రవూఫ్(9వ తరగతి) ఎంపికైనట్లు హెచ్‌ఎం వరప్రసాద్ శనివారం తెలిపారు. ఈ నెల 17న మద్దికెరలో సూపర్ సెవెన్ క్రికెట్ టీం అసోసియేషన్ నిర్వహించిన అండర్-17 జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో రవూఫ్ ప్రతిభ కనబరిచాడన్నారు. ఆదివారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు

ఆలూరు రూరల్: విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు రాకుండా ఉండేందుకు శనివారం పట్టణంలోని విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేశారు. ఆలూరు ఏఎల్‌ఎంతో పాటు సిబ్బంది ఆలూరులోని 11 కేవీ టౌన్ ఫీడర్ ట్రాన్స్‌ఫార్మర్లను చెక్ చేసి లూస్ స్పాన్, ట్రీ కటింగ్ వంటి మరమ్మతులు చేశారు. ఏఏ ట్రాన్స్‌ఫార్మర్లకు అధికలోడ్ పడుతోంది, ట్రిప్పింగ్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ తీగలను చెక్ చేసినట్లు సిబ్బంది చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసేందుకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ప్రతి శనివారం మరమ్మతులు చేయిస్తున్నారన్నారు.

జీపీఎస్‌పై నిరసన

ఎమ్మిగనూరు టౌన్: గ్యారెంటీ పెన్షన్ స్కీం బిల్లును రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఫ్యాప్టో జిల్లా నాయకులు ఎల్లప్ప, కెరె కృష్ణ, ఖాశీంజీ, రాష్ట్ర నాయకులు గోట్ల చంద్రశేఖర్, నాగమణి, రవికుమార్, బసవరాజు కోరారు. జీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో తాలూకా కన్వీనర్ వీజీ వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఎమ్మిగనూరు టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, డీఈ నీరజ అన్నారు. శనివారం జీనియస్ గ్లోబల్ కళాశాలలో కరస్పాండెంట్ గంగాధర్‌రెడ్డి అధ్యక్షతన, ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని వారు విద్యార్థులకు సూచించారు. సదస్సులో ప్రిన్సిపాల్ మునిస్వామి, ఏఓ హనుమంత్ పాల్గొన్నారు.

వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ అద్దాలు ధ్వంసం



మద్దికెర:మండల పరిధిలోని బసినేపల్లి గ్రా మంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ కిటికీ అద్దాలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసినట్లు సిబ్బంది శనివారం తెలిపారు. పేదలకు గ్రామాల్లోనే వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం క్లినిక్‌లు నిర్మించి, సౌకర్యాలు కల్పించిందని, ఓర్వలేని వారు అద్దాలు పగులగొట్టారని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఓటరు జాబితా ప్రక్షాళన

- పారదర్శకంగా జాబితా తయారీకి కసరత్తు
- ఇప్పటి వరకు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,49,524
- అక్టోబర్ 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటన



బీఎల్‌ఓలు చేస్తున్న సర్వేను పర్యవేక్షిస్తున్న ఆర్వో (ఫైల్)

ఆలూరు రూరల్: వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. ఇప్పటికే జూలై 21 నుంచి ఆగస్టు చివరి వరకు దాదాపు నెల రోజులకు పైగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఆలూరు నియోజకవర్గంలో మొత్తం 2,49,524 మంది ఓటర్లు ఉన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి చేసిన సర్వేలో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 294 పోలింగ్ కేంద్రాల్లో 5,378 మంది ఓటర్లను ఆయా కుటుంబ సభ్యులు, ఇంటి చుట్టు పక్కల వారినీ విచారించి, వివిధ పార్టీల బీఎల్‌ఏల అభిప్రాయాలు తీసుకుని మరణించి వారి, గ్రామం విడిచి వెళ్లిన వారి ఓటర్లను తొలగించారు.

పక్కాగా ఓటరు జాబితా..

రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రక్షాళన పక్కాగా నిర్వహిస్తున్నట్లు ఆలూరు నియోజవకవర్గ ఎన్నికల అధికారులు వెల్లడించారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఒకే ఇంట్లో పది మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న వారికి నోషన్ డోర్ నంబర్లు ఇచ్చారు. అలాగే ఫారం-8 ద్వారా ఒకే డోర్ నంబర్లలో ఉన్న రెండు, లేదా మూడు కుటుంబాల ఓటర్లను ఇతర డోర్ నంబర్లకు మార్పులు చేశారు. డబుల్ ఎంట్రీలు, డూప్లికేట్ ఓట్లను సైతం గుర్తించారు.

నియోజకవర్గలో నాలుగు పోలింగ్ కేంద్రాలు మార్పు..

ఆలూరు నియోజకవర్గంలో ఓటర్లకు అసౌకర్యంగా ఉన్న నాలుగు పోలింగ్ కేంద్రాలను మార్పు చేశారు. ఆలూరు మండలంలోని హులేబీడు గ్రామ ఆర్సీఎం పాఠశాలలో పోలింగ్ కేంద్రం 124 శిథిలావస్థకు చేరడంతో ఆ పోలింగ్ కేంద్రాన్ని డీఎస్‌టీ పాఠశాలలోకి మార్చారు. హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో ఉన్న 17, 18 పోలింగ్ కేంద్రాలను జెడ్పీ హైస్కూల్‌లోకి మార్పు చేశారు.

అత్యధిక, అత్యల్ప ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు

ఆలూరు అసెంబ్లీ పరిధిలో ఉన్న 294 పోలింగ్ కేంద్రాల్లో దేవనకొండ మండలంలోని దేవనకొండ పోలింగ్ కేంద్రం 242లో అత్యధికంగా 1,386 మంది ఓటర్లు ఉన్నారు. చిప్పగిరి మండలం గుమ్మనూరు కొట్టాల పోలింగ్ కేంద్రం 93లో అత్యల్పంగా 212 మంది ఓటర్లు నమోదై ఉన్నారు.

మిగిలిన షెడ్యూల్ ఇలా..

- సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16 వరకు 15 రోజుల పాటు ఫారం ఒకటి నుంచి 8 వరకూ పరిశీలిస్తారు. పెరిగిన, తగ్గిన ఓటర్ల జాబితాలు తయారు చేస్తారు.
- అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకూ ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. రెండో శని, ఆదివారాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియ నిర్వహిస్తారు.
- ఓటర్ల జాబితాలో వచ్చిన అభ్యంతరాలను, క్లెయిములను డిసెంబర్ 26 లోగా పూర్తి చేస్తారు.
- 2024 జనవరి 1న తయారైన ఓటర్ల జాబితాను ఆమోదానికి పంపిస్తారు.
- 2024 జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రకటిస్తారు.

ఆలూరు నియోజవకర్గం మండలాలు: 6
(ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద, దేవనకొండ)
పోలింగ్ కేంద్రాలు : 294
ఇప్పటి వరకు మొత్తం ఓటర్లు: 2,49,524
ఫారం-6(కొత్త దరఖాస్తులు) : 6,321
ఫారం-7(తొలిగించిన ఓటర్లు): 5,378
ఫారం-8 (మార్పులు): 4,555

తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేస్తాం



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అత్యంత పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ చేస్తున్నాం. ప్రతి మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షలు జరిపి లోపాలుంటే సరి చేస్తున్నాం. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను అక్టోబర్ 17న ప్రదర్శిస్తాం. ఓటర్లందరూ ఆ జాబితాను పరిశీలించుకుని ఏదైనా లోపాలు ఉంటే సరిచేసుకోవాలి. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న వారందరికీ ఓటు హక్కు కల్పిస్తాం.

– మల్లికార్జున, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆలూరు

వైద్య శిబిరాలను ఉపయోగించుకోండి



మాట్లాడుతున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బాలచంద్ర రెడ్డి

వెల్దుర్తి: ఆయుష్మాన్ భవ వైద్య శిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలని స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బాలచంద్ర రెడ్డి సూచించారు. శనివారం సీహెచ్‌సీలో ఆయుష్మాన్ భవ క్యాంపు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ హాజరయ్యారు. సూపరింటెండెంట్, జెడ్పీటీసీ సభ్యుడు, వైద్యులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద, మధ్య తరగతి ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలన్నీ అందించడమే ఆయుష్మాన్ భవ లక్ష్యమన్నారు. స్థానిక సీహెచ్‌సీ కేంద్రంగా ఈనెల 28, 30వ తేదీలలో క్యాంపులు ఉంటాయన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు అలిసాబ్, సాహితి, హేమలత, రంగస్వామి పాల్గొన్నారు.

25న హుండీ కానుకల లెక్కింపు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీరంగనాథస్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను ఈనెల 25న లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు పంచ, కండువా ధరించి లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులు గృహనిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శనివారం స్థానిక జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయా గృహ నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయని వాటికి అందాల్సిన బిల్లులు, సిమెంట్, ఇసుక తదితర వాటి గురించి హౌసింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గృహనిర్మాణాలు సత్వరం పూర్తయితే కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ తిలక్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా మేళా



చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో చేనేత హస్తకళా మేళా ఆకట్టుకుంటోంది. స్థానిక చేనేత వస్త్రాలతో పాటు పోచంపల్లి, మంగళగిరి, వెంకటగిరి, ధర్మవరం, గద్వాల పట్టు, కాటన్, కలంకారి శారీస్, షర్టులు, కొండపల్లి, ఏటికొప్పాక చెక్కబొమ్మలు ఉన్నాయని, కొనుగోలు చేసి నేత కార్మికుల నేత వృత్తిని ప్రోత్సహించాలని నిర్వాహకులు శేషుబాబు, నారాయణ ప్రజలను కోరారు. ఈనెల 28వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

రైతులను ఆదుకోండి



ఆర్‌బీకే అధికారికి వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోవడంతో కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘ జిల్లా నాయకుడు గోవిందు, తాలూకా అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య కోరారు. ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం కలుగొట్ల రైతుభరోసా కేంద్రం ఎదుట ధర్నా చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌బీకే అధికారికి అందజేశారు. నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట పరిహారాన్ని అందజేయాలని కోరారు. క్రమంలో ఆయా సంఘాల నాయకులు అబ్దుల్లా, రాజు, సుభాన్, రాముడు, బాషా తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపులో ఆలస్యం ఉండదు



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దశరథ రామయ్య

నందవరం: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారికి బిల్లుల చెల్లింపులో ఆలస్యం లేకుండా ఎప్పటికప్పుడే చెల్లిస్తామని ఎంపీడీఓ దశరథ రామయ్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని హాలహర్వి జగనన్న కాలనీలో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు బిల్లులు పెండింగ్ లేకుండా ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందన్నారు. థర్డ్ పార్టీ ఏజెన్సీ సభ్యులు, గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గురుస్వామి, పంచాయతీ కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

ఎల్లార్తి దర్గాల హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాల హుండీలో మూడు నెలలుగా భక్తులు వేసిన కానుకలను శనివారం లెక్కించారు. రూ.9.05లక్షల ఆదాయం వచ్చినట్లు డిస్ట్రిక్ట్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్(డీఎండబ్ల్యూఓ) సబియా పర్వీన్ తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఈఓ అబ్దుల్ రహిమాన్, ఆదోని, నంద్యాల డివిజన్ల వక్ఫ్‌బోర్డు ఆడిటర్ అండ్ ఇన్‌స్పెక్టర్లు అల్తాఫ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

దళితులకు రక్షణ కల్పించాలి

దేవనకొండ: దళితులపై రోజురోజుకు దాడులు ఎక్కువవుతున్నాయని, రక్షణ కల్పించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఆనంద్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. దళిత రక్షణ యాత్ర శనివారం దేవనకొండకు చేరుకుంది. బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కరుణాకర్, రమేష్, విజయమ్మ, సురేంద్ర, మండల ఉపాధ్యక్షులు యూసుఫ్‌బాషా, మండలాధ్యక్షులు నాగేష్, పాండు, రాయుడు, బలరాముడు, బండ్లయ్య, మహేంద్ర, రాముడు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



వైద్య శిబిరం వివరాలను డాక్టర్‌ను అడిగి తెలుసుకుంటున్న రామచంద్రారెడ్డి

మద్దికెర: ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి సూచించారు. శనివారం ఫ్రెండ్స్ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో అర్జగేరి రామకృష్ణారెడ్డి, రుక్మిణమ్మ జ్ఞాపకార్థం ప్రవాస భారతీయులు ప్రేమసాగర్ రెడ్డి, వెంకమ్మరెడ్డి ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రారెడ్డి సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రకాష్‌రెడ్డి, విజయ్‌ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు శాంతన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

- సమగ్రశిక్ష ఏపీసీ వేణుగోపాల్



విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న ఏపీసీ వేణుగోపాల్

గోనెగండ్ల: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త వేణుగోపాల్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, గాజులదిన్నె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(హరిజనవాడ)ను తనిఖీ చేశారు. నాడు-నేడు పనులను పరిశీలించారు. నాణ్యత లోపించకుండా పనులు చేపట్టేలా చూడాలని అధికారులకు సూచించారు. కేజీబీవీ విద్యార్థినులను తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయులు బోధించే విధానాన్ని పరిశీలించి, విద్యార్థినుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, సమయపాలన పాటించాలన్నారు. జూనియస్ గ్లోబల్ స్కూల్‌ను తనిఖీ చేసి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల విద్యార్థుల జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జీసీడీఓ సునీత, ఎంఈఓలు రామాంజనేయులు, నీలకంఠ పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి

కృష్ణగిరి: మారెమ్మ బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ సురేష్ పుట్లూరు గ్రామస్తులకు సూచించారు. శనివారం సాయంత్రం ఆయన గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయ ఆవరణంలో మద్యం తాగినా, ఇతరత్రా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. ఉత్సవాల సందర్భంగా గ్రామానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చే అవకాశం ఉండటంతో ఆరు రోజుల పాటు బందోబస్తు ఏర్పాటుచేసి నిఘా పెంచుతామన్నారు.

రుణాల రికవరీ చేపట్టాలి

కృష్ణగిరి: రైతు ఉత్పత్తిదారుల సంఘాల నుంచి రుణాలను సకాలంలో రికవరీ చేయాలని సంఘం సీసీ నాగరత్నమ్మ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆమె సంఘం లావాదేవీలపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలోని దాదాపు 190 రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో 2,200 మంది సభ్యులు ఉన్నారన్నారు. వీరు కొన్నేళ్లుగా సంస్థ నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించడం లేదన్నారు. సిబ్బంది అందరూ వందశాతం రుణాల రికవరీ చేయాలన్నారు. సమావేశంలో సంఘం సభ్యుడు మనోహర్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సరోజమ్మ పాల్గొన్నారు.

మహిళా బిల్లు ప్రవేశపెట్టడం అభినందనీయం

ఎమ్మిగనూరు టౌన్: మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం అభినందనీయమని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు సుభాన్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తపాల అబ్దుల్ హకీం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం 6వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. సంక్షేమ పథకాల పోస్టర్లను, లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు.

టమాటాకు గిట్టుబాటు ధర కల్పించాలి

పత్తికొండ రూరల్: పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌లో టమాటా పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో శనివారం పత్తికొండ-గుత్తి రహదారిపై ఆందోళన చేపట్టారు. జనసేన, బీజేపీ నాయకులు రాజశేఖర్, సీసీ రంగన్న, శంకరయ్యాచారి మాట్లాడుతూ వారం రోజుల నుంచి టమాటాకు సరైన ధర లేక రైతులకు రవాణా చార్జీలు అందడం లేదన్నారు. మార్కెట్ అధికారులు స్పందించి సరైన ధర అందించేలా చూడాలని కోరారు. రాస్తారోకోతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో అక్కడికి చేరుకుని నాయకులను పంపించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

మేలైన గడ్డి జాతితో అధిక పాల దిగుబడులు

- పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర ఆచారి



పెద్దకొత్తిలిలో సమీకృత దాణాను పంపిణీ చేస్తున్న ఏడీ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర ఆచారి

నందవరం: పాడి రైతులు పశువులకు మేలైన గడ్డి జాతి అందించడంతో అధిక పాల దిగుబడి పొందవచ్చని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర ఆచారి సూచించారు. శనివారం మండల పరిధిలోని జొహరాపురం, పెద్దకొత్తిలి గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో పశు వైద్యుడు నరేంద్రనాథ్ రెడ్డి నేతృత్వంలో పాడిరైతులకు మేలైన గడ్డి జాతి పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం పాడి రైతులకు సమీకృత పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీకృత దాణా వాడడంతో పశువులలో పాల దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. రెండు క్వింటాల ధర రూ.3,160 కాగా ప్రభుత్వం రాయితీతో రూ.1,300లకే అందిస్తుందన్నారు. దూడల పెంపకంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. పశువులకు సక్రమించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి టీకాలు వేయించుకోవాలని సూచించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

వెల్దుర్తి: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. స్థానిక ఏఓ అక్బర్‌బాషాతో కలిసి ఆయన దుకాణాల్లోని రిజిస్టర్లు, అనుమతి పత్రాలు, స్టాకు బోర్డులు, నిల్వలు పరిశీలించారు. నిబంధనలు పాటించి, రైతుల ఆధార్ అనుసంధానంతో కూడిన ఈ పాస్ మిషన్‌తో, అనుమతి ఉన్న ఎరువులను మాత్రమే విక్రయించాలని, కొనుగోలుదారులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణదారులను ఆదేశించారు.

నూతన సంస్కరణలు వద్దు

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ఆలూరు: ప్రభుత్వ విద్యావిధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన సంస్కరణలను అమలు చేయడం వల్ల పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయనంద్ అన్నారు. స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఇబ్రహీమ్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్షుడు రంగన్న, కార్యదర్శి అబ్దుల్లా, నాయకులు అమర్, రవి, పోతురాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

హాలహర్వి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి ఆదేశించారు.శనివారం మండలంలోని గూళ్యంలో ఆయన పర్యటించారు. హౌసింగ్ లేఅవుట్‌ను సందర్శించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ రామాంజనేయులు, ఈఈ ప్రభాకర్, డీఈ ఆదినారాయణ, ఎంపీడీఓ ఆంథోనీ, ఆర్‌ఐ రామారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు బిల్లులు అందేలా చూడాలన్నారు.

వచ్చే నెల 15 నుంచి విజయ దశమి ఉత్సవాలు

- దేవరగట్టు ఆలయ చైర్మన్ శ్రీనివాసులు

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టు ఆలయంలో వచ్చే నెల 15వ తేదీ నుంచి విజయ దశమి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 24న విజయదశమి (కర్రల సమరం బన్నీ) ఉండటంతో రోడ్డు, తాగునీరు, విద్యుద్దీకరణ, మరుగుదొడ్లు తదితర ఏర్పాట్లపై ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అర్చకులతో చర్చిస్తామన్నారు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా వెల్దుర్తి వాసి



బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఏఎస్ఎస్ వరప్రసాద్

వెల్దుర్తి: సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పట్టణానికి చెందిన ఏఎస్ఎస్ వరప్రసాద్ ఉద్యోగం సాధించారు. మండల కేంద్రంలోని 1వ వార్డుకు చెందిన మల్లికార్జున, నాగమణి దంపతుల కుమారుడు ఏఎస్ఎస్ వరప్రసాద్.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైద్యుల నియామకంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ఎంపికయ్యారు. ప్రభుత్వం స్థానిక సీహెచ్‌సీలోనే పోస్టింగ్ ఇవ్వడంతో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. స్థానికుడు సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఉద్యోగం సాధించడంతో పాటు స్థానిక ఆస్పత్రిలోనే బాధ్యతలు చేపట్టడంతో పలువురు పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ, వరప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.